## Honey..Darling! - SKU



నేను కారు కొన్నప్పుడు కార్ ఇన్సూరెన్స్ కోసం కొటేషన్లు తీసుకుంటూ కొంత మంది ఇన్సూరెన్స్ ఏజంట్స్ తో మాట్లాడటం జరిగింది. ఆ టైమ్ లో ఒక ఏజంట్ (నా ప్రస్తుత ఇన్సూరెన్స్ ఏజంట్) నన్ను మాటి మాటికీ "Honey" అని సంబోధించటం చాలా చిరాకు వేసింది. మనకి మనసులో వున్నది వెళ్ళగక్కకుండా వుండటం కొంచెం కష్టం. కనుక, అతనితో ఒకసారి మాట్లడటం అవగానే, మనసులో అనుకోవలసింది పైకే, "వీడికి నేను Honey ఏమిటో!" అనుకున్నాను. అది నా పక్క క్యూబ్ లో వుండే అతనికి వినపడింది.

ఏమిటీ సంగతి అని అడిగారు. చెప్పాను అతను నన్ను నా first name తో కాకుండా Honey అని పిలుస్తున్నారు నాకు చాలా చిరాగ్గా వుంది అని.

"మరి అతనికి చెప్పచ్చు కదా, నాకు నువ్వు నన్ను అలా Honey అని పిలుస్తుంటే చాలా uncomfortable గా వుంది. నన్ను నా first name తో పిలువ్ అని?" ప్రశ్నించారు.

"చెప్పచ్చు. కానీ, చిన్నబుచ్చుకుంటారేమో?" సందేహించాను.

"అయితే పైకి గొణగటం మానేయ్!" మందలించారు నా సంశయాత్మక ధోరణిని ఆటపట్టించే ఆయన.

* * *

మొన్న మా ఇంకో co-worker వేరే ఉద్యోగం వచ్చి వెళ్ళిపోతుంటే, మేమందరం అతనికి సెండాఫ్ పార్టీ మా దగ్గర వున్న ఒక రెస్టారెంట్ లో ఇచ్చాము. అక్కడ waitress మగవాళ్ళని "Sir" అని, ఆడవాళ్ళని "Madam" అనీ సంబోధిస్తున్నారు.

ఆమె వచ్చి మా మార్కెటింగ్ మేనేజర్ Cara ని "ప్లేట్ తో పని అయిపోయిందా మేడమ్?" అని అడిగి, ఆమె తలూపగానే ఆమె తిన్న ప్లేట్ తీసుకెళ్ళిపోయారు.

ఆమె వెళ్ళగానే మా Cara అసంతృప్తి గా "నాకు ఎవరన్నా అలా మేడమ్ అని పిలిస్తే నచ్చదు" అన్నారు.

"మరి ఇంకేమని పిలవాలి?" అడిగారు ఆమె పక్కన కూర్చున్న మరొక వ్యక్తి.

"మిస్ అనచ్చు కదా? మేడమ్ ఏమిటీ? ఫన్నీ గా!?" ఇంకా అదే చిరాకు మూడ్ లో జవాబిచ్చారు Cara.

నాకు వెంటనే, ఇండియా లో అయితే, Miss కీ Mrs. కీ మధ్య తేడాని మెళ్ళో సుత్రాలు, ప్రధానం వుంగరం, కాళ్ళకి మట్టెలూ వగైరా గుర్తులతో గుర్తుపట్టడం గుర్తొచ్చింది. మరి ఇక్కడా గుర్తుపట్టచ్చు, నమ్మకం, బాధ్యత అనుకునే వాళ్ళు పెళ్ళి వుంగరం ఇక్కడా పెట్టుకుంటారు. కానీ, పాపం

వేగం గా పని చేసుకునే ఆ అమ్మాయి తను సర్వ్ చేసే ప్రతీ కస్టమర్ కీ ఇవన్నీ వున్నాయో లేదో గమనించి, గుర్తు పెట్టుకొని, దానికి తగినట్టు గా సంబోధించాలంటే కొంచెం కష్టం ఏమో!

సరే, మళ్ళీ మా డిస్కషన్ విషయం లోకి వెళ్తే, నాకు వచ్చిన సందేహమే అడిగారు మా బాస్ Cara ని. "మిస్ మరి మేడమ్ ఎప్పుడు అవుతారు? Mrs. అని పిలవటం రిస్క్ కదా (పిలిచిన వాళ్ళకి)"

"సందేహం వచ్చినప్పుడు మిస్ అని పిలవాలి. అంతే కానీ, ఇలా మేడమ్ అని పిలవటం నాకు నచ్చదు"

"మేడమ్ అని పిలవటం వల్ల ఇబ్బంది ఏమిటీ నీకు అసలు?"

"మేడమ్ ఏమిటీ అసహ్యంగా ఏదో నాకు 60 ఏళ్ళు వచ్చాక ఎవరన్నా నన్ను మేడమ్ అని పిలిచారన్నా అర్థం వుంది. నేను అప్పుడే మేడమ్ లా కనిపిస్తున్నానా?!"

Cara చాలా అప్ సెట్ అయి ఆ ప్రశ్న వేసినా అక్కడ వున్న వాళ్ళం అందరం ఆ రోజు ఆమె ఆ ప్రశ్న వేసిన తీరు కి నవ్వేసాము.

* * *

ఈ మధ్య ఎదో వెబ్ సైట్ లో కరన్ జోహార్ "కాఫీ విత్ కరన్" అనే ప్రోగ్రామ్ తాలూకు వీడియోలు వున్నాయి. అందులో ఆయన ఫిల్మ్ స్టార్స్ ని పిలిచి, వాళ్ళకి కాఫీ లూ ఇంకా చాలా ట్రోఫీలూ ఇచ్చి, పక్క వాళ్ళ గురించీ, అవతల వాళ్ల గురించీ గాసిప్ లు అడుగుతూ వాళ్ళ నుండి వివరాలు లాగుతూ వుంటారు.

దాని కోసం అధిక శాతం ఆయన తనకి అత్యంత సన్నిహితులు అయిన స్టార్స్ ని ఎంచుకున్నారు అని విన్నాను. ఇంటర్వ్యూ చేసే వ్యక్తి కీ స్టార్ కీ మధ్య గాఢమైన స్నేహం వుండటం వలన ఈ ఇంటర్వ్యూలు కూడా ఒక రకమైన పర్సనల్ టచ్ తో రొటీన్ కి భిన్నంగా వున్నాయి అనిపించింది.

అవి చూసిన ఒకామె కామెంట్ చేసారు "అంతా బానే వుంది కానీ, కరన్ ఇలా అందరినీ 'డార్లింగ్' అని పిలవటం ఏమిటో లా వుంది" .. అంటే ఇలాంటి అసందర్భ సంబోధనలు మనని చేస్తే మాత్రమే కాదు, వింటానికి కూడా ఇబ్బందే అన్నమాట!

* * *

మా ఆఫీస్ బిల్డింగ్ ఎదురుగా వున్న బిల్డింగ్ లో ఒక చిన్న స్నాక్ బార్ వుంది. ఎప్పుడన్నా లంచ్ తెచ్చుకోవటం అవకపోయినా, వెళ్ళి తినటానికి టైము లేకపోయినా, మేమంతా రోడ్ దాటి, అక్కడ ఏదో ఒకటి తెచ్చుకుంటూ వుంటాము.

అక్కడ ఒకమ్మాయి వుంటారు. చాలా చలాకీ గా చురుగ్గా వుంటారు. అందరి ఆర్డర్లూ ఒక్కసారి చెప్తే చాలు ఎన్నాళ్ళు అయినా మర్చిపోరు. అంత జ్ఞాపక శక్తి వున్న మనిషి మరి అదేం పాపమో పేర్లు

మాత్రం గుర్తు పెట్టుకోరు అనుకుంటా, అందరినీ ఒకటే విధం గా సంబోధిస్తారు. అదే, "Honey" అని!!

ఈ సారి మళ్ళీ గమనించక తప్పలేదు.

షాప్ నుండి తిరిగి మా వర్క్ కి వస్తుంటే, నేను, నాతో పని చేసే Lora ఇద్దరం ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్నాము. మా ధోరణి అర్థం కానీ మాతో వచ్చిన Fred "ఏమిటీ విషయం?" అడిగారు.

Lora అప్పటికే గమనించారు నాకు ఎవరన్నా నన్ను Honey అని పిలిస్తే చిరాకు అని.. నేను ఆమె సంబోధన గమనించి 101 సారి నా బాధ వెళ్ళబుచ్చటానికి విసుగు వచ్చి కేవలం నాలో నేను నవ్వుకుంటున్నాను అని అర్థం అయి, తనకీ నవ్వు వచ్చింది.. నేను ఏం కామెంట్ చేస్తానా అని.. వెయిట్ చేస్తున్నారు.

అప్పటికీ నేను ఏమీ మాట్లాడక పోయేసరికి Fred కి అర్థం అయ్యేట్టు చెప్పారు నా Honey కథ!

"Why? she is pretty!" ఆమె అలా పిలవటం వలన మాకొచ్చిన ఇబ్బంది అర్థం కాని Fred అడిగారు.

"అయితే ఆమె Honey అని మిమ్మల్ని పిలవటం మీకేమి ఇబ్బంది కాదంటారు!?" టీజింగ్ గా అడిగాను.

"Nope! "

"ఏమో, నాకు అలా తెలీని వ్యక్తులు వచ్చి నన్ను ఇలా ఏదో చనువు వున్నట్టు 'Honey', 'Darling' వగైరా అంటే అంతగా నచ్చదు" చెప్పాను.

పక్కనే వున్న Lora Fred తో, "నిన్ను Honey అని పిలిచిన వ్యక్తి అమ్మాయి కనుక నువ్వు No problem అన్నావు" అని తేల్చేసరు.

* * *

అదే మాటల మధ్య Lora తన పాత ఉద్యోగం లో జరిగిన ఒక సంఘటన గురించి ఇలా చెప్పుకొచ్చారు..

వాళ్ళ కంపెనీ లో కొత్తగా ఒక Marketing Executive ని తీసుకున్నారుట. ఆయనది అంతా అతి చనువు. Lora ని Lori అని, Jashua ని Josh అనీ, ఇలా అందరివీ పేర్లు విరిచేసి పిలవటం మొదలెట్టారుట. చాలా మందికి ఇలాంటి అతి చనువు నచ్చదు. ముఖ్యం గా పేరు అంటే ఎంతో మక్కువ వున్న మా Lora లాంటి వ్యక్తులకి. కానీ, మొహమాటమో, మరేదో, చివరికి చాలా సందర్భాలలో గబుక్కున నన్ను అలా పిలవద్దు అని నిక్కచ్చిగా చెప్పలేము. అలా, కొంత మంది

ఇష్టం లేకపోయినా అతనికి ఏమీ చెప్పక, అతను తమ పేరుని ఖండఖండాలుగా పిరిచేస్తుంటే భరించలేక సతమతమయ్యేవారుట.

ఒక రోజు వాళ్ళ కంపెనీ మీటింగ్ లో ఎప్పుడో తప్ప రాని వాళ్ళ ప్రెసిడెంట్ కూడా వచ్చారుట. ఆ మీటింగ్ లో రిపోర్ట్ ఇస్తూ ఈ పెద్ద మనిషి తన మామూలు ధోరణి లో అందరికీ తను పెట్టుకున్న ముద్దు పేర్లతో పిలుస్తూ తన రిపోర్ట్ ఇస్తున్నారుట.

అతన్ని మాటల మధ్య ఆపి వాళ్ళ ప్రెసిడెంట్ ఆపి, "ఎవరీ Lori, Josh.. వగైరా? నాకు తెలిసీ నా కంపెనీ లో అలాంటి పేర్లు వున్న మనుషులు ఎవరూ పని చెయ్యటం లేదు. వాళ్ళని వాళ్ళ పేర్లతో పిలువ్" అని చెప్పారుట.

పాపం ఆ పెద్ద మనిషి మొఖం ఎలా మాడిపోయి వుంటుందో ఊహించుకోవటం నాకు పెద్ద కష్టం కాదు.. కారణం? నేను అలాంటి సందర్భం ఒకసారి ఎదుర్కొన్నాను కనుక!

* * *

చాలా చిన్నప్పుడు జరిగిన సంఘటన! బహుశా నాకు ఏడెనిమిదేళ్ళు అనుకుంటా అప్పుడు. మా వీధి లో మా క్లాస్ మేట్ మాలతి అని ఒక అమ్మాయి వుండేది. మా అమ్మగారికి తను అంటే భలే ముచ్చట. చాలా తెలివైన అమ్మాయి అని. వాళ్ళ తమ్ముడు, తనూ, నేను, మా సుజీ ఎక్కువ ఆటలాడుకునేవాళ్ళం. మా అక్క ఈడు వాళ్ళు వాళ్ళలో ఎవరూ లేకపోవటం తో మా అక్క తను మా కన్నా పెద్దది కనుక చిన్న పిల్లలతో ఏం ఆడతాం లే అని మమ్మల్నీ, మా ఆటల్నీ లైట్ తీసుకునేది.

సరే, ఇంతకీ మాలతి ని వాళ్ళ అమ్మగారు "మౌళి" అని పిలిచేవారు.

నాకు ఆ పిలుపు చాలా నచ్చింది. మాలతి అనే కన్నా మౌళి అని పిలిస్తే బాగుంటుంది అనిపించింది. కనుక వెంటనే, నేను కూడా తనని "మౌళి" అని పిలవటం మొదలెట్టాను.

కానీ తను నేను అలా రెండు మూడు సార్లు పిలవగానే చెప్పింది.. "నాకు అలా మా అమ్మగారు తప్ప ఇంకెవరు పిలిచినా నచ్చదు" అని!

నాకు తెగ ఉక్రోషం వచ్చేసింది.

అప్పట్లో శంకరాభరణం సినిమా విడుదల అయిన రోజులు. నేను భరత నాట్యం నేర్చుకునేదాన్ని. శంకరాభరణం లో పాటలు టేప్ పెట్టి ఆ పాటలకి మంజుభార్గవి లాగ ఫీల్ అయిపోతూ ఏదో వచ్చీరాని చిందులు వేసేసేదాన్ని. మాలతి శంకరశాస్త్రి, మా సుజీ, లేక వాళ్ళ పవన్ ఎవరు వుంటే వాళ్ళు తులసి అన్నమాట! ఇలా ఏవేవో ఆటలు ఆడేసుకునేవాళ్ళం.

మా అమ్మగారికి మాలతి అంటే ముచ్చట అని చెప్పాను కదా, మేము ఇలా శంకరాభరణం డ్రామాలు మా అరుగు మీద వేసేస్తుంటే ఖాళీ వున్నప్పుడు తను ప్రేక్షకురాలు అయేవారు.

రోజు స్కూల్ నుండి రాగానే మాకు డాన్స్ క్లాస్ లేని రోజుల్లో ఈ కార్యక్రమం పెట్టేవాళ్ళం.

మాలతి ఇలా నన్ను మౌళీ అని పిలవద్దు అని చెప్పగానే, ఉక్రోషం తో ఆ రోజు తనని మా ఇంటికి పిలవలేదు. లేక వస్తే నేను ఆడను అని చెప్పానో! మా అమ్మగారు అడిగారు ఏమిటీ విషయం అని!

చెప్పాను నేను మౌళీ అని పిలవగానే తను అలా పిలవద్దు అని తని చెప్పిన విషయం. మా అమ్మగారు కూడా తననే సమర్థించారు. "తను అన్నదానిలో తప్పేముందీ? తనకి ఇష్టం లేకపోయి వుండచ్చు నువ్వు అలా పిలవటం. నేను నిన్ను ముద్దుగా ఎన్నో పేర్లతో పిలుస్తా. కొన్ని సార్లు నువ్వే దెబ్బలాడతావు నాతో.. అలా పిలవద్దు అని.. తను చేసిందీ అదే కదా.. నిన్ను ఎవరన్నా సూరి అని పిలిస్తే వంటింట్లో నా దగ్గరకి వచ్చి ఎన్ని పేరాంగాలు ఆడతావ్?! మర్చిపోయావా?!" గుర్తు చేసారు.

అలా సర్ది చెప్పి మా మధ్య మళ్ళీ సయోధ్య కుదిరేలా చేసారు మా అమ్మగారు!

---

మీ సలహాలు, సూచనలు, అభిప్రాయాలు రచయిత్రి SKU కి తెలియపరచండి.
మీ అభిప్రాయాలు రచ్చబండ లో తెలియచేయండి